గాలిదేవరు

సి. రామచంద్రరావు

కిల్లిక్ నన్ అండ్ కంపెనీ ఎయిర్ కండిషన్డ్ విజిటర్స్ రూమ్‌లో సోమయ్య పరధ్యానంగా ఫార్ట్యూన్ పత్రిక తిరగేస్తూ కూర్చున్నాడు. ముందు బల్లమీద ఇంకా మెర్క్యురీ, టైమ్, న్యూయార్కర్, బిజినెస్‌వీక్ కామర్స్, కేపిటల్ స్టాక్ మార్కెట్ బులిటెన్లూ, ఎయిరిండియా ఇంటర్నేషనల్ ప్రకటన కాగితాలూ కొల్లలుగా పడివున్నాయి. అతని మనసు వాటి మీద లేదు. త్వరగా వచ్చిన పని ముగించుకుని వెళ్ళిపోవాలని వుంది.

గత ఆరేడు సంవత్సరాలుగా కాఫీ పంటకి లభిస్తున్న అధిక వెలలవల్లనైతేనేం. కంపెనీ అవలంబిస్తున్న ఉత్కృష్ట వ్యవసాయ పద్ధతులవల్లనైతేనేం, పాలిబేటా ఎస్టేటు విపరీతమైన లాభాలు గడించింది. అందుకు తగ్గట్టుగా ఉద్యోగస్తులకి పెద్ద బోనస్ ఇచ్చింది. కాని చిన్న ఉద్యోగులు బోనస్‌తో తృప్తిపడలేదు. ఎంతోకాలంగా వాయిదా పడుతున్న సౌకర్యాలు ఈ మంచి రోజుల్ని పురస్కరించుకుని తమకి కల్పించవలసిందిగా కంపెనీకి రాయమని మేనేజరుకి విజ్ఞప్తి చేసుకున్నారు. సోమయ్యకి సానుభూతి కలిగింది. బ్రిటిష్ పరిపాలనలో కాబట్టి వాళ్ళ పరిస్థితి ఎంత హీనంగా వున్నా సరిపోయింది. స్వాతంత్ర్యం వచ్చిం తరువాత కొంత మెరుగేకాని, ఇంకా వాళ్ళకి చెయ్యవలసినవి చాలా వున్నాయి. పాపం, ఎండనక, వాననక రోజస్తమానూ కాఫీ చెట్లల్లో తిరుగాడుతూ వుంటారు. ఇంటికిపోతే రాత్రి ఎలక్ట్రిక్ దీపమయినా వుండదు. చాలామటుకు యిళ్ళు

కూలిపోతున్నట్టుంటాయి. వర్షాకాలం కష్టంతా కారుతూవే వుంటుంది. వర్షాకాలం అంటే కొండకిందలాగా నాలుగురోజులుండిపోయేది కాదు. నాలుగు మాసాలు ఏకధారగా కుండపోత. ఇంట్లో సరయిన స్నానాలగది వుండదు. ఉన్నా అందులో అన్ని సదుపాయాలూ వుండవు. ఎప్పుడూ చెమ్మగిలి వుంటుంది. కాలకృత్యాలు తీర్చుకోడానికి అంత వర్షంలోనూ చిన్నా, పెద్దా ఇంటి వెనకాల దూరంగా కట్టిన రేకుల చూరు కిందకి పరిగెత్తవలసిందే. కంపెనీ అభివృద్ధికి పాటుపడుతున్న వీళ్ళెందుకు ఇంత కష్టపడాలి? అధిక లాభాలు గడిస్తున్నప్పుడు కొంత ఖర్చుచేసి వాళ్ళ సౌఖ్యాల్ని గమనించడం కంపెనీ విధి అనిపించింది సోమయ్యకి.

చిన్న ఉద్యోగుల కష్టాలు వివరించి, ముఖ్యంగా వాళ్ళ యిళ్ళయినా బాగుచేసి నూతన వసతులు కల్పించమని కంపెనీని కోరేడు సోమయ్య. ఎలక్ట్రిసిటీ కూడా యిస్తే బాగుంటుందని రాయబోయాడు. మేనేజిమెంటుకీ, తక్కిన చిల్లర ఉద్యోగులకీ వుండే వ్యత్యాసం సన్నగిల్లిపోతుందేమోనని భయం వేసింది. తనకీ, తన యిద్దరి అసిస్టెంట్ మేనేజర్లకీ విశాలమైన చక్కని బంగళాలున్నాయి. వాటికి వేరే వేరే జెనరేటర్ల ద్వారా ఎలక్ట్రిసిటీ సరఫరా అవుతుంది. ఇటువంటి ఆధిక్యత ఉండబట్టే గదా కింద ఉద్యోగులకీ, కూలీలకీ మేనేజిమెంటంటే భయం, భక్తి వున్నాయి. ఈ విభేదాలు తీసిపారేస్తే, సోమయ్యకి అనుకోకుండా చిక్కుసమస్య ఎదురుపడింది. ఈ భేదాలు కృత్రిమంగా కల్పించిన వేనా? తాము చూపించే ఠీవీ, అధికారం, కార్యసాధన, ఉద్యోగం అంతస్థువల్ల సంపాదించినవా? ఇప్పుడిప్పుడు చిన్న ఉద్యోగాల్లో చేరుతున్న కొందరు చదువుకున్న యువకులతో తమ స్థానాల్ని నింపితే వాళ్ళు కూడా తమంత చాకచక్యంతో ఎస్టేటు నడపగలరా? మహా ప్రయత్నం మీద ఆలోచనల్ని పరి పరివిధాలా పోకుండా అణచిపెట్టుకుని. ఎలక్ట్రిసిటీ ప్రసక్తి ఎత్తకుండా ఉత్తరం ముగించాడు సోమయ్య.

తన ప్రతిపాదనలన్నింటినీ కంపెనీ ఆమోదించినప్పుడు అతని మనస్సు ఆనందంతో నిండిపోయింది. కింది ఉద్యోగులమీద వాత్సల్యం పెల్లుబికింది. వెంటనే ఇంటి కప్పుల్నీ, గోడల్నీ బాగు చెయ్యడానికి ఎస్టేటు కాంట్రాక్టర్ని నియమించాడు. నూతన పద్ధతిలో స్నానాల గదులు కట్టడం, పాత గచ్చుమార్చి మొజయిక్ గచ్చు వెయ్యడం చుట్టుపక్కల ఎవరివల్లా కాదు. బెంగుళూరులో కిల్లిక్ సన్ అండ్ కంపెనీ సేనిటరీ ఫిట్టింగ్స్‌లోనూ, మొజయిక్ గచ్చు చెయ్యడంలోనూ పేరు పొందింది. వాళ్ళకే ఈ పని పురమాయించడానికి నిశ్చయించుకున్నాడు. కిల్లిక్ సన్ కంపెనీతో బేరసారాలుండవని తెలిసినా మేనేజింగ్ ఏజన్సీలకి తగ్గింపు ధరలు చెప్పవచ్చనే ఆశకొద్దీ వాళ్ళకి రాయడానికి పూనుకున్నాడు. ముప్ఫైయిళ్ళకి స్నానాల గదులు, ఒక్కొక్క గదికీ, వాష్‌బేసిన్, ఫ్లష్‌పుట్, షవర్, నేలకీ, గోడలకీ గది ఆరడుగుల ఎత్తువరకూ మొజయిక్ పెంకులూ, ఇవికాక డ్రాయింగ్ రూమ్‌కీ, భోజనాల గదికీ, మొజయిక్ గచ్చు, ఉత్తరం పూర్తిచేసి చదివిం తరవాత కాని యింత భారీ పని అనిపించలేదతనికి. పెద్ద మొత్తం ఖర్చు చేస్తున్నప్పుడు తనే బెంగుళూరు వెళ్ళి ఎందుకు సంప్రదించకూడదూ? కారు మైలేజీకి తను తీసుకునేది ఏ పాటి? రెండు నెలల్నించి ఎస్టేటు కదిలి బయటికిపోక విసుగువుడుతున్నదని భార్య ఒకటే గోల. తను కూడా ఈ మధ్య ఎస్టేటు వ్యవహారాల్లో ఎక్కువగా చిక్కువడి నలిగిపోయాడు. రెండురోజులు తిరిగివస్తే ఉత్సాహం పుంజుకుని మళ్ళీ బాధ్యతలు నెత్తిమీద వేసుకోడానికి తయారయి రావచ్చుననిపించి బెంగుళూరు వచ్చాడు.

'ఇలా రోజంతా నాలుగ్గోడల మధ్యా కాచుక్కూచుంటూ గడిపేస్తేనేం తేరుకుని ఇంటికి వెళ్ళినట్టే'పుస్తకం మడిచి బల్లమీదకి విసిరికొట్టి ఒళ్ళు విరుచుకుంటూ అనుకున్నాడు సోమయ్య. ప్యూన్ తలుపు తోసుకుని వచ్చి 'మీరు లోపలికి పోవచ్చు' అన్నాడు.

With Best Compliments From:

Ph. No.: (0884)-21408

Kanthi
Graphic Plates

ADAVI POLAM, YANAM-533 464

సోమయ్య లేచి మేనేజింగ్ డైరెక్టరు గదిలోకి వెళ్ళాడు. ఏంధోని చిన్నప్ప కరచాలనం చేసి అతను కూర్చోడానికి మెత్తని కుర్చీ చూపించాడు. చిన్నప్పది రంగైన విగ్రహం. చక్కని కనుముక్కు తీరు. అన్నిటికీ మించి మిసమిసలాడుతున్న యౌవనం. 'ఇంత చిన్న వయసులో ఎంత అధికారం చలాయిస్తున్నాడు' అనుకోకుండా వుండలేకపోయాడు సోమయ్య.

'నేను మీకేం చెయ్యగల్ను' అన్నాడు చిన్నప్ప టెరీన్ షర్టుమీద తోపు రంగు టైని సర్దుకుంటూ. సోమయ్య వచ్చినపని వివరించాడు. పెద్ద కాంట్రాక్టు ఇవ్వబోతున్నాడని విన్న చిన్నప్ప అన్నాడు.

'అన్నట్టు అడగడం మర్చిపోయాను. ఏం పుచ్చుకుంటారు?'

'ఏమీ ఒద్దు. థాంక్స్!' అన్నాడు సోమయ్య.

'అదేవిటి, చల్లని కొండల్లో వుండే మీలాంటి అదృష్టవంతులు మీ ప్రాంతాల ఎండలు భరించలేకుండా వుండాలి. దాహమయినా తీరు తుంది. బీయర్ పుచ్చుకోండి' అంటూ ప్యూన్ కోసం బజ్జర్ నొక్కాడు చిన్నప్ప.

సోమయ్య బట్టలు మాత్రం ఎండలు తట్టుకునేందుకు వుపయోగపడేలా లేవు. బరువైన ట్వీడ్ సూటు వేసుకున్నాడు. వెడల్పాటి టైని మూడువంతులు వెయిస్ట్ కోటులోకి తోసేశాడు.

'క్షమించాలి. బయట కార్లో నా భార్యని కూర్చోపెట్టి వచ్చాను. సాధ్యమయినంత త్వరగా పని ముగించుకుని వెళితే బాగుంటుంది' అన్నాడు సోమయ్య.

'అయ్యో! ఎందుకావిడ్ని లోపలికి తీసుకురాలేదు. ఇప్పుడయితేనేం పిలుద్దాం' అన్నాడు చిన్నప్ప.

'ఒద్దొద్దు. ఆడవాళ్ళు చుట్టుపక్కల చేరితే పని తెవిలినట్టే' అడ్డుపడ్డాడు సోమయ్య.

'వ్యాపారం వాళ్ళ రంగం కాదు గదా!' లౌక్యంగా నవ్వాడు చిన్నప్ప. లోపలికి వచ్చిన ప్యూన్ వైపు తిరిగి అన్నాడు 'ఆళ్వాగారిని ఇక్కడికి రమ్మను'

'మేనేజరు ఆఫీసులో లేనట్టున్నారు' అన్నాడు సోమయ్య.

'ఆ, మర్చిపోయాను. ఆళ్వా ఎయిర్‌పోర్టుకి వెళ్ళాడు. అతని అసిస్టెంటుని పిలుస్తాను'

చిన్నప్ప ఇంటర్ కమ్యూనికేషన్ ఫోన్ అంది పుచ్చుకున్నాడు.

'ఆయన కూడా లేరనుకుంటా. వాళ్ళు లేరని నన్ను మీ దగ్గిరకి తీసుకొచ్చారు' అన్నాడు సోమయ్య.

'గోపీనాధ్ కూడా వెళ్ళాడన్నమాట. మా ఎరువుల డిపార్ట్‌మెంట్ మేనేజర్ అమెరికానుంచి ఈరోజు నాలుగుగంట్ల విమానంలో వస్తున్నారు' ఆఫీసర్లు లేకపోడానికి కారణం చెప్పాడు చిన్నప్ప.

'వివరాలు నాకు చెప్పండి. రాసుకుని ఆళ్వాకిస్తాను' అన్నాడు మళ్ళీ.

'నేను కొలతలు తీసుకురాలేదు. మీ ఆఫీసునుంచి ఎవ్వరైనా వచ్చి చూడ్డానికి వీలుండదా?' అన్నాడు సోమయ్య.

'ఓ... దానికేం' చిన్నప్ప అన్నాడు. 'మీ ఎస్టేటు ఎక్కడన్నారు?'

'మర్కారాకి పదిమైళ్ళదూరంలో మేంగళూర్ రోడ్డుమీద'

చిన్నప్ప మెమోపేడ్ మీద రాసుకున్నాడు.

'నామతిమరుపు క్షమించాలి. ఎస్టేటుపేరు?' చిన్నప్ప అడుగుతూనే సోమయ్య పంపించిన విజిటింగ్ కార్డుకోసం బల్లమీద వెదికాడు.

'పోలిబేటా ఎస్టేటు' అన్నాడు సోమయ్య.

'పోలిబేటా... ఎక్కడో విన్నట్టు జ్ఞాపకం' కళ్ళు చికిలించి, శబ్దాన్ని అరికట్టడానికి గది గోడలకతికిన థెర్మాకోల్ లోపలికి చూస్తూ ఆలోచనలో మునిగిపోయాడు చిన్నప్ప.

'తప్పకుండా విని వుంటారు. ఈ మధ్య షేర్స్ మంచి ధరలో వున్నాయి, ఎస్టేటంతా ఏరెబికా కాఫీయే...' ఉత్సాహంగా చెప్పకుపోతున్నాడు సోమయ్య.

'మేంగిల్స్ బ్రదర్స్ ఎస్టేటు కదా' అడిగాడు సోమయ్య.

'వాళ్ళెప్పుడో అమ్మేశారు. గ్రీన్‌వుడ్స్ కంపెనీ ఇప్పుడు మేనేజింగ్ ఏజెంట్స్'

'అదే ఎస్టేటన్నమాట'

సోమయ్యకి అతని మాటలు బోధపడలేదు.

'ఏవిటి?' అన్నాడు.

'గాలిదేవరు వెలిసింది మీ ఎస్టేట్లోనే నన్నమాట'

'ఔను'

'ఐతే వేరే మనుషులెందుకు. నేనే వస్తాను'

చిన్నప్ప మొహం వికసించింది.

'తప్పకుండా రండి' ఆహ్వానించి సోమయ్య అన్నాడు.

'గాలిదేవరు మీద మీకు గురి వున్నట్టుంది'

'కావలసినంత వుంది' చిరునవ్వు నవ్వాడు సోమయ్య. ఇన్ని మైళ్ళ దూరంలో వున్న వాళ్ళకి కూడా గాలిదేవరు మహిమ పాకినందుకు సోమయ్యకి ఆశ్చర్యం వేసింది. తమ ఎస్టేటులోనే వెలిసినందుకు కొంత తృప్తి, గర్వం కూడా కలిగాయి. టీ టయిముకి అనుకున్న ప్రకారం భార్యని స్నేహితురాలి ఇంటికి తీసుకువెళ్ళపోతే జరిగే రాద్ధాంతాన్ని తలుచుకుని ఎంత ఉబలాటంగా వున్నా గాలిదేవరు ప్రశంసకి పూనుకోకుండా వ్యవహారం ముగించుకుని అక్కణ్ణించి బయటపడ్డాడు.

* * * * *

'ఇక్కణ్ణుంచి జీప్ పోదు సార్!' అన్నాడు డ్రైవరు.

'ఐతే అవు' ఆజ్ఞాపించాడు సోమయ్య.

ఎస్టేటు జీపు కూలీల యిళ్ళముందు ఆగింది. పిల్లలు దాన్ని చుట్టు ముట్టేశారు. డ్రైవరు పొమ్మని కసురుతున్నాడు సోమయ్య. ఏంఛోనీ చిన్నప్ప, అతని పరివారం ఇద్దరు ముగ్గురు జనం జీపులోనుంచి కిందకి దుమికారు. దూరంగా పోయి మంచున్న పిల్లలకి చిన్నప్ప వేసుకున్న రంగురంగుల బొమ్మలచొక్కా వినోదంగా వుండి కిలకిల లాడుతున్నారు. ఇళ్ళల్లో నుంచి కొందరు కూలీలు వచ్చి సోమయ్యకి సలాం చేశారు.

'అదుగో, మాంకూ ఇక్కడే వున్నాడు' అన్నాడు సోమయ్య. మాంకూ పళ్ళికిలిస్తూ ముందుకు వచ్చి చేతులు కట్టుకుని మంచున్నాడు. మొహం ముడతలు పడిపోయింది. తెల్లటి వెంట్రుకలు కావిరంగు తల గుడ్డ కింద నుంచీ అక్కడక్కడా బయటికి కనిపిస్తున్నాయి. మోకాళ్ళకిందకి జీరాడుతున్న అడ్డపంచె రంగు తెలియనంతగా మాసిపోయింది.

'ఇక్కడేం చేస్తున్నావ్? దొంగసారా కాస్తున్నావా, బద్మాష్?' అన్నాడు సోమయ్య.

'రామరామ, దొర పాదాలంటి సెబతా. ఆ యేల దొర కూకలేసిన కాణ్నుంచీ మళ్ళీ ఆ యెడవ పనికాడి కెల్లనేదు'

సోమయ్య పాదాలు ముట్టుకోడానికి ఒంగాడు మాంకూ. మేకులు కొట్టిన బూట్సు కాళ్ళు దూరంగా జరిపి వారించాడు సోమయ్య.

'దొంగ వెధవ, అన్నీ అబద్ధాలే' నవ్వి అన్నాడు. 'సరేకాని, కూడా రా, ఈ పెద్దమనుషుల్ని గుడి దగ్గరికి తీసుకెళ్దాం'

'సిత్తం'

చిన్నప్పవైపు తిరిగి సోమయ్య చెప్పాడు. 'గాలిదేవరు హడావిడంతా వీడే. గుడి దగ్గరే పడుంటాడు. పూజల్లోనూ, జాతరల్లోనూ చూడాలి వీడి ప్రతాపం.'

'ఎస్టేట్లో పనిచెయ్యడం లేదా?' అడిగాడు చిన్నప్ప.

'వాడి మొహం పని. ఈ ఎస్టేటు వేసినప్పణ్ణుంచి ఇక్కడున్నట్టున్నాడు. ఒక్కరోజయినా పని చేసేడంటే నాకు నమ్మకం లేదు'

'ఒయసయిపోయింది గందా!' మాంకూ వేలాడుతున్న చేతికండరాల్ని తడిమిచూసుకుంటూ అన్నాడు.

'బలంగా వున్నప్పుడు మహా పనిచేసినట్టు' అన్నాడు సోమయ్య.

'సెయ్యికుంటానే తోటింత ఉద్దినోకొచ్చినాది కావోసు' చేతులు తిప్పాడు మాంకూ.

చిన్నప్ప నవ్వాడు. మాంకూ అతని వైపు తిరిగి అడిగాడు.

'ఏ యేలకి దొరా యేల్లీదీ?'

'రాస్కెల్, ఇప్పుడే' అన్నాడు సోమయ్య. 'ఎందుకొచ్చే ననుకుంటున్నావ్ యింతదూరం. నిన్ను చూట్టానికా?'

సోమయ్య తిట్లు మాంకూని బాధపెట్టినట్లు లేవు. నవ్వేడు.

'దొర్లు సేతుల్లో ఏటిదీ ఏసుకురాలేదేటా అని అడిగేను'

'ఏవిట్రా తీసుకొచ్చేదీ?' అరిచాడు సోమయ్య.

'దేవారుకాడికి నెయిపేద్దాం నేకంటా యెల్లటవా దొరా' బుర్రగోక్కుంటూ వేలచూపులు చూశాడు మాంకూ. 'పెద్ద దొర్లోల్లని ఎంటేసుకొత్తేవో యేటపోలేనా ఎయ్యొద్దేటిది?'

'ఏడిశావ్, తొరగా రా' అన్నాడు సోమయ్య.

'ఇదో ఒచ్చేత్తాను' మాంకూ ఇళ్ళల్లోకి పరిగెత్తి మూడు కోడిపెట్టలు తీసుకొచ్చాడు.

'ఎంత డబ్బోసినా యియ్యనని కూసున్నారు. కాల్లట్టుకుని బెతిమాలేను'

'ఛా, ఛా, దొంగవెధవా! ఎన్నేళ్ళొచ్చినా బుద్ధులు మాత్రం మార్లేదు' అన్నాడు సోమయ్య.

చిన్నప్ప కలగజేసుకొని అడిగాడు.



'ఎంతకి బేరవాడేవ్?'

'పదేనురూపాయలిప్పించీ సేయండి' అన్నాడు మాంకూ.

'ఈ కోళ్ళని గాలిదేవరుకి నన్ను సమర్పించనియ్యండి' సోమయ్యతో అన్నాడు చిన్నప్ప. జేబులోనుంచి డబ్బులీసి, పదిహేను రూపాయలు లెక్కపెట్టి మాంకూకిచ్చాడు. తలపాగా మడతల్లో, నోట్లు దాచుకుంటూ మాంకూ అడిగాడు. 'ఈటెల్ని మనం తీసికెల్దావా? దొర్లు తొందరపడి పోతావుండారు. పూజి సేయిచ్చేతలికి టయిమవుద్దుంటే ఆనాకా ఒచ్చి వేసట్టించుకెల్లి దేవొరుకిత్తాను'

సోమయ్య మాంకూని మళ్ళీ తిట్టబోయాడు.

'అది మంచిదే' అన్నాడు చిన్నప్ప. 'ముసలాడు ఆ బరువు కూడా యివ్వడెక్కడ మోసుకురాగలడు?' మాంకూ నవ్వుతూ కోళ్ళని యిళ్ళల్లో ఒదిలేసి చేర కత్తి పట్టుకుని వచ్చాడు.

ముందు మాంకూ, వెనక సోమయ్యా, చిన్నప్పా, అతని బృందం కూలీల యిళ్ళపక్కనుంచి కొండలోయలోకి పోతున్న కాలిబాటలో వడక సాగిం చారు. కాఫీ చెట్లు రెండువైపులా దట్టంగా మనిషెత్తున పెరిగివున్నాయి. చెట్లనిండా కాఫీ పిందెలు, వాటి బరువుకి కొమ్మలు ఒరిగి నేలని తాకుతున్నాయి. కొన్ని బాట కడ్డం పడ్డాయి. వాటిని ఎత్తి పట్టుకుని వెనకవాళ్ళకి దారిచేస్తున్నాడు మాంకూ. అక్కడక్కడ ముళ్ళ చెట్లని నరికి దూరంగా పారేస్తున్నాడు. సన్నటి జారుడు బాటలో అతి కష్టం మీద పడకుండా నడుస్తున్న చిన్నప్పని ముసలివాడి దేహదార్ఢ్యం ఆశ్చర్యపరిచింది. మేనేజింగ్ డైరెక్టరే వెనుకున్నప్పుడు మారుమాట్లాడలేక వెనకవున్న పట్నం మనుషులు నెమ్మదిగా అడుగులేసి అడుగేస్తున్నారు. వాళ్ళు తొడుక్కున్న తెల్లచొక్కాలూ, పేంట్లూ, పసరూ, జిడ్డూ పులుముకున్నాయి. ఆఫీసుకి వేసుకునే సున్నితమైన జోళ్ళమీద మందంగా బురద అంటిపెట్టుకుని వుంది.

వాళ్ళ పరిస్థితి చూస్తే సోమయ్యకి నవ్వాగలేదు.

'ఇప్పడీ బాట యిలా వుంది కానీ, వేసంకాలంలో ట్రంక్‌రోడ్‌లాగా వుంటుంది' అన్నాడు. అతను ఖాకీచొక్కా, నిక్కరూ వేసుకొని, నెత్తిమీద టోపీ పెట్టుకుని ఎస్టేటు దుస్తుల్లో సుఖంగా వున్నాడు.

'అదేటి సాపెత్తం దొరా. ఆ దారే యేరు. ఏనకి యేలు జనం ఒల్తారుగండా అంతలక్క సుబ్బరం యిప్పడెట్టా ఒత్తాదీ?' అన్నాడు మాంకూ.

'వేసంకాలంలో ఏమిటి విశేషం?' అడిగాడు చిన్నప్ప.

'అప్పడు గాళిదేవరు జాతర జరుగుతుంది' అన్నాడు సోమయ్య.

'ఎంతకాత్తంటే సరిపోద్ది కాని వోనల్లో ఎవురొత్తారు దొరా?' మాంకూ అన్నాడు. 'సలికాలం మాత్తరం రాటానికవుద్దేటి?'

'అహా, అలాకాదు. కాఫీ పూతకి ముందు వర్షాలకోసం దేవర్ని ప్రార్థించడానికి ఒస్తారు' అన్నాడు సోమయ్య.

మార్చి ఏప్రిల్ మాసాలలో అనుకూలమైన వర్షాలు పడితేనే కాని కాఫీ చెట్లు పూత పట్టవు. ఆ ఒక్క పూత మీద సంవత్సరం పంట ఆధారపడి వుంటుంది. ఒక్కొక్కప్పుడు వర్షాలు ఆలస్యమవుతూ వుంటాయి. అప్పుడు పంట దెబ్బ తింటుంది. ఎప్పుడయినా పడకపోవడం కూడా కద్దు. ఆ యేడాదికి పంట మీద ఆశ ఒదులుకోవాలసిందే. ఈ అవాంతరాల నుంచి తప్పించమని కూర్గు ప్రజలు దేవర్ని కొలుస్తారు. జాతర జరుపుతారు. గాళిదేవరు గాలిదేవత, వర్షం దేవత పెనుగాలుల్తో ఋతుపవనాల్ని లాక్కొచ్చి సకాలంలో వర్షాలు కురిపించే ఆప్తబంధువు. అయిదు ఎకరాల కాఫీ తోటలున్న సామాన్యుడికైనా, అయిదారువేల ఎకరాల్ని కనిబెదుతున్న కంపెనీ మేనేజర్లకైనా గాళిదేవరు దయా, సహాయం అవసరం. అందుకే జాతి, మత విచక్షణా, అంతస్థుల భేదాలు పాటించకుండా అందరూ ఈ ఉత్సవంలో పాల్గొంటారు.

'అంత మగాత్తెం వుండమట్టే గుర్రాల్దొర ఈదారి వూరోల్లందరికీ ఒదిలిండు' అన్నాడు మాంకూ.

'గుర్రాల్దొరంటే మేంగిల్స్' చిన్నప్పతో చెప్పాడు సోమయ్య.

'ఆ, మంగిలీసుదొరే. మాకండీసను మడిసి, గుర్రవెక్కి సావారీ సేత్తే గెలిసీ, వోడీ బూపెపంచకంలో నేడనీవోరు. వులియేట కెల్తే కత్తీ, తుపాకీ అక్కల్లేదు' అన్నాడు మాంకూ.

'అందుకే ఇంటికి పరుగుచ్చుకున్నాడు' అన్నాడు సోమయ్య.

'పోన్లేదొరా, ఆ మారాజు వెల్లిపోటవే వెయ్యం. దొరసానమ్మకి యీ వోనలూ, ఒరదలూ పట్టేయి కావు, సీవగడ్డనే వుంటా ఒక్కోతలికి ఒచ్చిపోతా వుండీనోరు' అన్నాడు మాంకూ.

'అప్పడీ తోట అమ్మకుండానే వుంటే కాఫీ తెస్తున్న ధరలకు కుబేరుడైపో యేవాడు' అన్నాడు సోమయ్య.

'యెదవ డబ్బు. ఆరికున్నాది సాల్దేటి?'

కాలిబాట వాళ్ళని చదునైన ప్రదేశంలో పెద్ద వృక్షం కిందకి తీసుకొచ్చింది. చెట్టుకింద మూడడుగుల ఎత్తున రాతిముక్కలూ, మట్టీ కలిపి దిమ్మవేసి వుంది.' దానిమీద చతురస్రాలగా పగలగొట్టిన తెల్లరాళ్ళతో కట్టిన చిన్న యినప్పెట్టెలాంటి చీకటిగది. లోపల విగ్రహం రూపురేఖలు చెక్కని ఒక రాయి. దాని ప్రక్కన త్రిశూలం. రాతిమీద పెద్దనిడుపాటి ఎర్రని కుంఖంబొట్టు.

'సెప్పలిడిసేసి దేవొరుకి దన్నవెట్టుకోండి' అన్నాడు మాంకూ. చుట్టు పక్కల మొలిచిన బంతిచెట్లనుంచి పువ్వులు తెంపుకువచ్చి తలొకటీ పంచిపెట్టాడు.

'ఇప్పడియ్యెట్టండి. ఆనాకా దొర్లపేరు సెప్పి కోడిపెట్టల్నేత్తా' అన్నాడు. అంత దగ్గిరగా మాట్లాడుతోంటే మాంకూ నోట్లోనుంచి సారావాసన గుప్పమని కొట్టింది.

'ఇదేనా గాళిదేవరు గుడి?' అప్పటివరకూ నోరు మెదపని తెల్లబట్ట మనుషుల్లో ఒకతను ఆశ్చర్యంగా అడిగాడు.

'ఇదే, నమ్మకం లేకుండా వున్నారా? పట్నాల్లో గుళ్ళలాంటి పెద్ద కట్టడాల్ని వూహించుకున్నట్టున్నారు' నవ్వాడు సోమయ్య.

'సిన్ని గుడి గందా అని ఎగతాళి సెయ్యబోకండహో, మరిగంటే దేవొరిక్కిను కొచ్చెనా మగాత్తెం సూపగల్దురు' అన్నాడు మాంకూ.

'ఎవరేమన్నార్రా?'

సోమయ్యకి తన మాటల్లో ఎక్కడైనా అపరాధం స్ఫురించిందేమోనని భయం వేసింది.

'ఆశ్రయిస్తే ఎంత దయగా వరాలిచ్చినా, ఆగ్రహం వస్తే అంతకి రెట్టింపు పట్టుదలా వుంది గాళిదేవరుకి' అన్నాడు తక్కినవాళ్ళవైపు తిరిగి. అతనికి మేంగిల్స్ పడ్డ కష్టాలు జ్ఞాపకం వచ్చాయి. వాటి గురించి మాట్లాడకుండా వుండలేకపోయాడు.

మేంగిల్స్ కట్టించిన పెద్ద బంగళా పూర్తవొస్తున్న రోజులు. అంతవరకూ అతను శిథిలమైపోతున్న పాత యింట్లోనే వుండేవాడు. అసలు మేంగిల్స్ బ్రదర్స్ కొన్నప్పుడు ఎస్టేటు మంచి స్థితిలో లేదు. కాఫీ మొక్కలు తిండిమొహం ఎరగనట్టు ఒడిలిపోయి వుండేవి. వాటిని సంస్కరించి కొంత డబ్బు చేసుకొనేవరకూ మేంగిల్స్ భార్యాపిల్లల్ని ఇంగ్లండులో తన అన్న దగ్గర విడిచిపెట్టేడు. వాళ్ళని ఆశ్చర్యపరిచేటంత పెద్ద బంగళా కట్టిగాని ఎస్టేట్లో వుంచననేవాడు. చివరికి బంగళా కట్టగలిగాడు గాని, దాని భోగం అనుభవించలేకపోయాడు. ఆ బంగళాలో వంటగది నుంచి వాడిన నీళ్ళు పోడానికి కట్టిన సిమ్మెంటు కాలువ గాళిదేవరు విగ్రహం పక్కగా పోయేది. అది దేవరుకి అపచారమని, వంటగదిని మార్చమనీ కూలీజనం మేంగిల్స్‌ని ప్రాధేయపడ్డారు. అతను నవ్వి వాళ్ళని పొమ్మని కసిరాడు. దేవరుకాగ్రహం కలుగుతుందనీ, అప్పుడు కీడు మూడడం తప్పదనీ హెచ్చరించారు. మేంగిల్స్ లెక్కచెయ్యలేదు. మూఢనమ్మకాలని విసుక్కున్నాడు. పైగా అనుకున్న రోజుకి ముందే వెయ్యదల్చుకున్న కుర్చీలూ, బల్లలూ ఇతర సామాన్లతో యిల్లు నిండకముందే కొత్త బంగళాకి మారాడు. ఆరోజునుంచీ అతని కష్టాలు మొదలయ్యాయి. గుర్రపు స్వారీకి వెళ్ళినవాడు చెయ్యి విరక్కొట్టుక్కుని వచ్చాడు. తరవాత తరవాత అతను తాగుతున్న గ్లాసులు మాయమయ్యేవి. ప్లేట్లలో భోజనం బదులు రాళ్ళు కనిపించేవి. తలుపులు జాగ్రత్తగా బిగించిన గరాజ్‌లో కారు రాత్రిళ్ళు స్టార్టయి, హారన్ మోగడం ప్రారంభించేది. ఇటువంటివే ఇంకా లెక్కలేనన్ని, గాళిదేవరు నిదర్శనాలని అందరూ పోరుపెట్టారు. మేంగిల్స్ భయపడ్డాడు. కాని తొందరగా లొంగలేదు. ఇల్లుమారిన పదవరోజున తన చిన్నకొడుకు హఠాత్తుగా చచ్చిపోయాడని ఇంగ్లండునుంచి కేబుల్ వచ్చినప్పుడు మాత్రం అతని ధైర్యం సడలిపోయింది. దానికితోడు ఆ యేడాది సకాలంలో వర్షం పడక కాఫీచెట్లు సరిగ్గా పూత పుయ్యలేదు. వెంటనే ఎస్టేటు బేరానికి పెట్టి పాత యింట్లోకి మారిపోయాడు.

'ఏటి సేత్తాం, రాతట్టాగుంటే, ఆయేల ఒచ్చేతలికి బుద్ధి అట్టా సేయిస్తది. దరమరాజంటి పెబువులికి పెడసరం బుద్ధి పుడతాదని కలగంతామా?' అన్నాడు మాంకూ.

'గుడి కట్టమని పురమాయించేదని మేంగిల్స్ మీద వీడికంత అభిమానం' మాంకూ వైపు తిరిగి అన్నాడు సోమయ్య.

'దాంట్లో ఏమాత్రం మిగిల్చేవురా?'

'దొర్లు పరాసికాలాడతన్నారు' అన్నాడు మాంకూ.

'ఈ గుడి నువ్వు కట్టేవా?' చిన్నప్ప అడిగాడు.

'ఔనుదొరా. తప్పసేసిందని సిచ్చకి గుడి లేపిందు గుర్రాల్దొర, నన్ను సూత్తానికి వుండమనిందు, శానా డబ్బయి పోనాది. నాదీ కాంతో, కూంతో ఆడ్డాది' అన్నాడు మాంకూ. సోమయ్య నవ్వాడు.

'మేంగిల్స్ ఒదిలేసిన బంగళాకి వెళ్ళడానికి ఇక్కణ్ణుంచి దారుందా?' సోమయ్యని చిన్నప్ప అడిగాడు.

'ఏరా?' మాంకూ వైపు చూశాడు సోమయ్య.

'అదేటి దొరా, యీ పెద్దెనకాల గుట్టమీదున్నాది. అదిగదే బంగలా. కొట్టిన దారేటీ నేదు'

'పోగలమా?' అన్నాడు చిన్నప్ప.

అందరూ బంగళాకి బయల్దేరారు. చిన్నగుట్టమీద విశాలమైన భాగం చదునుచేసి వుంది. ముళ్ళపొదలూ, అడివి మొక్కలూ ఇంటిచుట్టూ దట్టంగా పెరిగివున్నాయి. ఇంటి తలుపులు ఎవరో పీకేసినట్టున్నారు. గుమ్మాలు సగంపైగా చెదలు తినేసో, ఊడిపోయో వున్నాయి. అక్కడక్కడా కిటికీలకు ఒక్కొక్క గాజుపెంకు వేలాడుతూంది. కప్ప మీద మచ్చుకైనా ఒక్క పెంకులేదు.

'పెంకులన్నీ మాంకూ పట్టుకుపోయి వుంటాడు' అన్నాడు సోమయ్య.

'అమ్మో, యీ బంగలా సరుకు అంటుకోటవే?' అన్నాడు మాంకూ.

'నీ యింటికి పెంకులూ, కలపా ఎక్కణ్ణుంచి వచ్చినయ్యిరా?' మాంకూ ఇంటివైపు చూపించాడు సోమయ్య. వాళ్ళెక్కి వచ్చిన దారికి ఎడంగా అరటిచెట్ల మధ్య కనిపించింది. కూలీల యిళ్ళలాలేదు. కొంచెం పై అంతస్థుకి చెందినట్టుంది.

'వీడు కాంట్రాక్టరయ్యాకా స్వయంగా కట్టుకున్నాడు' అన్నాడు సోమయ్య మళ్ళీ.

'రగతం వోడ్చి గడిచ్చిన సొమ్మెట్టి కట్టిచ్చీను' అన్నాడు మాంకూ. సోమయ్య పెద్ద నవ్వు నవ్వాడు.

కూలిపోయిన ముందు గుమ్మంలోనుంచీ చిన్నప్ప బంగళాలో ప్రవేశించాడు. తక్కినవాళ్ళు అనుసరించారు.

'పెద్దబంగళా'

'మేంగిల్స్‌కి చాలామంది పిల్లలుండేవారట. ఆరుగురనుకొంటాను. తలొక గదీ కట్టించి, అతిథులకోసం ఇంకొకటి కట్టించాడు' అన్నాడు సోమయ్య.

'ఇది స్నానాలగాదిలా వుంది' రెండో తెల్లబట్ట మనిషికి స్నానాల గది చూస్తే ప్రాణం లేచి వచ్చింది. దాని పొడుగూ, వెడల్పూ, ఎత్తూ చూసి ఎన్ని మొజయిక్ పెంకులు వెయ్యాలో ఒక్క నిముషంలో అంచనా వేసేశాడు.

'స్నానాల గదులూ, మొజయిక్ పెంకులూ వుంటే నీ కింకేవీ అక్కర్లేదు' నన్నాడు చిన్నప్ప.

మేనేజింగ్ డైరెక్టరు మెప్పు అతన్ని సంతోషంలో ముంచివేత్తింది.

'అన్నేళ్ళ క్రితం కూడా యింత విశాలంగా స్నానాల గదులు కట్టేరంటే నమ్మలేకుండా వున్నాను' అన్నాడు.

'దీంట్లో వేసిన తొట్టెలవీ చూస్తే మరీ ఆశ్చర్యపోదురేమో మీరు. ఇంగ్లీషు తయారీలో ప్రత్యేక రకానివట' అన్నాడు సోమయ్య.

'సూత్తేకల్లు జిగేల్మనీది. సవద్రం వడాన్ని ముంచేసిన్రు' అన్నాడు మాంకూ.

'ఆ!' తెల్లబట్ట మనిషి ప్రాణం కొట్టుకుపోయింది.

'అవును, మేంగళూర్ సముద్రంలో పారేయించేశాడు మేంగిల్స్' అన్నాడు సోమయ్య.

'ఎందుకు?'

'వాటికి గాలిదేవరు శాపం తగిలింది. మళ్ళీ పాత ఇంటికిపోతూ మేంగిల్స్ కొత్త బంగళా స్నానాల గదుల్లో తొట్టెలూ, షవర్లూ, అద్దాలూ, అప్పటికి తయారై వచ్చిన కొద్దిపాటి కుర్చీలూ, సోఫాలు వంటి విలువైన సామాన్లూ రెండు రెండెడ్ల బళ్ళకేసి పట్టుకుపోదామనుకున్నాడు. మొదటి బండి వంద గజాలు నడవకుండానే ఒక యెద్దు కూలిపోయి చచ్చిపోయింది. ఈ

TARACHAND SHA

Shop: 425670
☎ 423456
Res. 423739
Fax: 425676

Email:
I.D.No. SATC. VJW/BILT ASSOCIATES

SHA AMICHAND TARACHAND & SONS

Whole-Salers: Ballrpur Industries Ltd., (Paper Division)

Sister Concern: **LALIT ENTERPRISES**
Mfg.: "Amir" Visiting Cards, Envelops & Wedding Cards

Post Box. No. 120, Nandipativari Street, VIJAYAWADA - 520 001





అపశకునంతో సామాన్లు ఎస్టేట్లో ఉండడానికి వల్లకాదు, దూరంగా పారెయ్యాలని గోల బయల్దేరింది'

'అమ్మెయ్యకపోయారా?' అడిగాడు తెల్ల బట్ట మనిషి.

'అమ్మడంలాగే వుంది. పడిపోయిన బండిలో వస్తువులు తిరిగి బంగళాకి జేరవెయ్యడానికే ఎవర్నీ ఒప్పించలేకపోయాడు మేంగిల్స్. ఎంత డబ్బాశ చూపించినా ఒక్క లారీ డ్రైవరూ బండివాడూ బరువు తీసుకెళ్ళి పారెయ్యడానికి ధైర్యం చెయ్యలేదు'

'సిగురుకి ఆ కిరస్తానీ బొట్లేరు తోలుకెల్లిండు. అల్లంతెత్తు కెరటం లెగిసిందంట ఆటిన్ని గిరాటేసేతలికి' అంది వుచ్చుకున్నాడు మాంకూ.

'నిజంగా సముద్రంలో పారెయ్యలేదట గదా?' అన్నాడు చిన్నప్ప. మాంకూ ఒకటి రెండు నిమిషాలు సంకోచించాడు.

'ఏటో దొరా, నాకు తెల్దు. ఆడయ్యన్నీ అట్టుకెల్లి యాపార వెట్టిండని యిక్కడోల్లు గుసగుసలాడుకునీ వోరు' అన్నాడు.

'మీరెవరూ మళ్ళీ బట్లర్ని చూళ్ళేదా?'

'ఏటిదికి! ఆదు బాగడిపోనాడంటూ యేదుత్తా వుంటానికి ఆడముండోడ్నేటి నేను? సేవుంటే నివ్వూ సంపాదించ్చాల'

'వాడు డబ్బు గడించిన విషయం నిజమేనన్నమాట' అన్నాడు సోమయ్య.

'అదేవో, నాకెట్టా తెలుస్తది? ఎట్టా గడించిండో, ఏపాటి గడించిండో నేనాడికాడికి పోలేదు, ఆడ్నాకు సెప్పనేదు, ఈ కుసుద్దవు యెదవలు కూసిందే ఆయెన కాల అడింకా పెద్దోడయి పోయిండంటూ యేడిసీ వోరు. తెలకదుగుతాను దొరా. వుంజిదు పింగానీ సిప్పలుచ్చుకుని లచ్చలు గడిచ్చటానికీ, ఆడిసేతిలో మాయ మంతరం వుందేటి?'

'పింగాణీ చిప్పలా? వాటి విలువ నీకు తెలిసినట్టులేదు' తెల్లబట్ట మనిషి మనస్సు చివుక్కుమంది.

'పోన్లే. మాంకూకి మనం ఇవ్వదు ఉద్యోగం ఇవ్వడం లేదుగా, వాటి గురించి బోధించనక్కర్లేదు' నవ్వాడు చిన్నప్ప.

'మీరు ఉద్యోగం ఇస్తానంటే మటుకు వస్తాడేవిటి వాడు?' అన్నాడు సోమయ్య.

'దొర్లకి ముసలోడ్ని సూత్తే ఆసికంగా వున్నాది. వొచ్చే పాణం, పోయే పాణం గాల్దేవుని పాదాలకాడ వగ్గేయాలిసిందే' అన్నాడు మాంకూ.

'చూశారా. వాడికిక్కడ కొండంత వ్యాపారం వుంటే, ఒదులుకుని మీదగ్గరికెలా రాగలడు?' అన్నాడు సోమయ్య.

'ఒద్దులే మాంకూ, మేం పట్టుబట్టడం లేదులే' అన్నడు చిన్నప్ప.

'అంతేసి ఊసులాడమాకండి దొరా' మాంకూ చేతులు జోడించి చిన్నప్పకి దణ్ణం పెట్టాడు.

స్నానాలగదినుంచి బయట వరండామీదకి, అక్కణ్ణుంచి బంగళా వెనక భాగంలోకి కదిలారంతా.

'దిట్టమైన కట్టడం' అన్నాడు తెల్ల బట్ట మనిషి.

'కలకాలం వుండాలని కట్టించింది కాని, ఇలా అవుతుందనుకోలేదుగా' అన్నాడు సోమయ్య.

'మేంగిల్స్ని భయపెట్టింది బట్లరేనట?' మాంకూ వైపు తిరిగి చిన్నప్ప అడిగాడు.

'ఆడేం సేసిందు?' అన్నాడు మాంకూ. 'దొర బంగలా యిడిసిపెట్టి యెల్లిపోతంటే బెయం వొద్దంటా పోరెట్టెండు. ఆ మారాజింటేనా? ఆఖరికే అరిగుండి బేజారెత్తి పోనాది. ఈ యెదవ వొలవొలా యేడిసిందు'

'తమాషాలన్నీ అతనేచేసి దేవరు మహత్త్వం అని మేంగిల్స్ని నమ్మించాడంటారే?' అన్నాడు చిన్నప్ప మళ్ళీ.

'అదేటి సాబువు, గుర్రాల్దొర సేసింది తప్ప యిదేవొరు కాగ్గరం వొత్తేనీ'

'కనిపించిన వాణ్ణంలా అల్లరిపెట్టి ఏడిపించడం అతనికి సరదా అట గదా?'

'ఆడికాగొనం వున్నది. ఓ పాలియేటి సేసిందూ. మా యింటిది

అమ్మోరుకి కోడిపెట్ట కోసెట్టింది. పూనకం అంటా యాడొచ్చి తలకాయ కాణ్ణుంచి సొంతం బోంచేసిపోయిండు'

చిన్నప్ప నవ్వాడు.

'మేంగిల్స్‌ని కూడా ఒక ఆట ఆడించాడని చెప్తారు' అన్నాడు.

'అబద్ధం. ఎవొరుదొరా సెప్పేదీ? ఈ తోట్లో ఒక్క గాడిది కొడుకుని సెప్పమనండి సూత్తా. నాలిక సీలిపోద్ది' అన్నాడు మాంకూ.

'మరి మేంగిల్స్ తాగుతున్న గ్లాను తీసేసి మాయమైపోయిందని వుకారు పుట్టించలేదూ?' అన్నాడు చిన్నప్ప.

'అది నత్తెవేదొరా' మాంకూ ఒప్పుకొన్నాడు.

'నిజంగానా? ఏం జరిగింది?' ఆతృతగా అడిగాడు సోమయ్య.

'ఆయాల దొర సీకాగ్గా ఎగిరిపడతండాడు. సెయ్యిరిగి కట్టేన్కాని ఆసుపత్తిరినించి వత్తానే పిచ్చోడ్నాగా యిల్లంతా గాలిచ్చేత్తా గళానుమీద గళాను యిస్కీ ఎక్కిచ్చేత్తండాడు. అతలికి కూలోల్లం సూట్టానికెల్లాం. ఎట్టాగినా వొంటేల్లు ఆకాద్నించి తప్పిచ్చెయ్యటానికి ఒప్పించాలా అని'

'వంటిల్లు మార్చడవెందుకు. నీళ్ళు గుడి దగ్గిరకి పోకుండా చెయ్యలేరా?' తెల్లబట్ట మనిషికి సందేహం వచ్చింది.

'బెమ్మాండపేటి గాని, కొండవాటం అట్టాగున్నాది. సిమ్మెంటూ, సున్నమూ యేసి కట్టిచ్చిన తూవు యిరగ్గొట్టనంటా పంతం పట్టి కూసున్నాడు దొర. మాయన్నీ తెలింతక్కువ నమ్మకాలంటా కూకలేసిండు'

'తరవాతేవయిందో చెప్ప' తొందరపెట్టేడు సోమయ్య.

'ఏటవుద్ది. మైకవులో వున్నాడేమో, సూట్టానికెల్లేదని గసిరి పొమ్మనేసిండు. కూలోల్లం ఒగ్గేడు. యినురుగా వచ్చి మీద వడిపోయిండు. వోపల బొట్లేరూ, వంటోడు దొర యిడిసేసిన కొంత యిస్కీ వుంటే, లాగేసిన్రు. దొర లాగటం అయిపోనాదని అల్లబ్రెమ. ఆవాకా దొర కూకలేత్తే బొట్లేరు బెయంపడిపోనాడు. ఆడికి తెలవదంటూ బొంకిండు. వంటోడూ అట్టానే బుకాయించిండు. పొద్దు పొడిసేయేలకి దొర తాగీ గలాసు గాల్దేవరు మగాత్తాన్ని మాయమయిందంటూ వోర్త గుప్పమన్నాది'

'నిజం బయటపడకుండా వుందా?' అన్నాడు తెల్లబట్ట మనిషి. ఏ విషయాన్నీ తర్కించకుండా నమ్మడం అతనికలవాట్లేదు.

'మాలాటోల్లు సలుగురి సెవులుకాడి కెట్టాగో వత్తాది. కూలోల్లందరికీ యెట్టా తెలుత్తాదీ? ఆ యెదవలిద్దరూ అడల్తా వొనకిపోతండారు గందా వోరిస్తారో యేపో'

'ఒకళ్ళకి తెలుస్తే అందరికీ తెలిసినట్టే' అన్నాడు తెల్లబట్ట మనిషి.

'గుర్రాల్దొర మాత్తరం నమ్మేరేటి? మోసపోయి పోనాదంటా శాన్నాల్లు సిదరిచ్చుకునీ సోరు. కదం మగెత్తాల సందట్లో యిదీ కమ్ముకుపోనాది' అన్నాడు మాంకూ.

'తక్కిన నాటకం కూడా బట్టరాడిందేవట' అన్నాడు చిన్నప్ప.

'మీకిదంతా ఎలా తెలుసును?' అడిగాడు సోమయ్య.

'విన్నాను' అన్నాడు చిన్నప్ప.

తను విన్నది చెప్పాడు.

గాలిదేవరు మహిమవల్ల విస్కీగ్లాసు మాయమయిందని మేంగిల్స్ నమ్మని మాట నిజమే. ఇది జరిగిన మర్నాడే బంగళా ఆవరణలో పెద్ద చెట్టు విరిగిపడి అతని పెంపుడుకుక్క చచ్చిపోయింది. దీంతో మేంగిల్స్ మనస్సు కలవరపడడం మొదలుపెట్టింది. దానికితోడు కూలీల గోల. అయినా జరిగినట్టు ఎవరికీ తెలియకుండా వుండాలని చాలా ప్రయత్నించాడు. ప్రతి పనిలోనూ అధైర్యం, అపోహ, భయం కమ్ముకువచ్చేవి. వింతగా ప్రవర్తించేవాడు. యజమాని నిర్బలత్వాన్ని చూస్తే బట్లరుకి నవ్వాగేది కాదు. దొర పిరికితనాన్ని ఆసరాగా తీసుకుని అల్లరిపెట్టి వినోదించకుండా

Sree Teja
Benefit Fund Limited

DECLARED AS A 'NIDHI' COMPANY BY THE GOVT. OF INDIA
(Serving the people since 1993 with two branches)

We accept Deposits

SAFETY
SECURITY
STABILITY
SERVICE

We Disburse Jewel Loans Mortgage Loans

HEAD OFFICE:
106, Rahmat Commercial Complex,
Ameerpet 'X' Roads,
Hyderabad - 500 016.
Ph: No.3730576 3732663

BRANCH OFFICE:
1st floor, Balaji Complex,
Adjacent to Venkatadri Theatre,
Dilsuknagar,
Hyderabad - 500 060.
Ph.No.:4064393

TRANSACTION WITH MEMBERS ONLY

వుండలేకపోయాడు. భోజన సమయంలో వాయికీ, వాయికీ పళ్ళేలు మార్చేటప్పుడు వీలు చూసుకొని అన్నం పళ్ళెం మార్చేసి వేర్పుగా రాళ్ళు పెట్టిన పళ్ళెం యిరికించేవాడు. మేంగిల్స్ పడకగది డ్రాయర్లో దాచుకున్న మారుతాళం తీసి, గరాజ్ పైకప్పునుంచీ లోపలికి దిగి కారు స్టార్టుచేసి, హారను వాయించి పారిపోయేవాడు. ఇంకా ఇటువంటివే ఎన్నో. మేంగిల్స్ కంగారుపడుతుంటే, యితనికి ఆటగా వుండేది. తమాషాల్ని నిజం అనిన నమ్మించగలిగానని మురిసిపోయేవాడు. అయితే, అవి వింత పరిణామాలకి దారితీస్తాయనుకోలేదు. అంతా జరిగి పోయిం తరువాత చెప్పడానికి ధైర్యం చాల్లేదు.

'దొర సెబతావుంటే నమ్మడానికిల్లేకంటా సిత్తరంగా వున్నాది' అన్నాడు మాంకూ.

'నాకు అలాగే అనిపిస్తూంది' అన్నాడు సోమయ్య.

కొంతసేపు జీపులో తిప్పి ఎస్టేటు చూపించి, గాలిదేవరు దర్శనం చేయించి ఛోటా విస్కీకి, కులాసా కబుర్లకీ తిరిగి అతిథుల్ని బంగళాకి తీసుకుపోదామనుకున్న సోమయ్య తమ ఊహించలేని విషయాల ఒత్తిడికి తట్టుకోలేకపోయాడు.

'వంటిల్లెటువైపు?' అన్నాడు చిన్నప్ప. అప్పటికే యిల్లంతా కలయజూసి చదరపు గజాలూ, ఘన పరిణామాలూ లెక్కకట్టిన తెల్లబట్ట మనిషి 'ఈచివర' అంటూ దారితీశాడు. చిన్నప్ప వంటగదిలో ప్రవేశించి, పాత్రలు కడిగే తొట్టిని పరీక్షించడం ప్రారంభించాడు. తొట్టి సిమ్మెంటు చాలావరకు పగిలిపోయి వుంది. లోపల ఇటికలు కూడా మూడు వంతులు కరిగిపోయాయి. మీద ఒకప్పుడు కొళాయి వుండేదనడానికి ఆనవాలుగా విరిగిపోయిన రేకుముక్కలు ఇక్కడా అక్కడా గోడకి అంటిపెట్టుకొని వున్నాయి. తొట్టికింద నీళ్ళు పోడానికి చేసిన కన్నం పూర్తిగా పూడుకుపోయింది. నేలమీద పడున్న ఒక పుల్లని తీసి కన్నం కెలికాడు చిన్నప్ప.

'ఇక్కణ్ణుంచేనా నీళ్ళు గాలిదేవరు విగ్రహం దగ్గరికిపోయేది?' అన్నాడు మాంకూని చూసి.

'అవును'

వంటగది బయటకివచ్చి సిమ్మెంటు కాలవకోసం చూశాడు చిన్నప్ప. గడ్డీ, మిట్టీతో కప్పబడిపోయి వుంది. ఇక్కడా అక్కడా కొంతరాయి బయటికి కనిపిస్తూంది. దాని వారన కాలిజోడుతో కొట్టి వర్షాలకి మెత్తబడిన కొంతమట్టిని పైకి లాగాడు.

'ఆ కత్తితో కాస్త పొడు మాంకూ' అన్నాడు.

మాంకూ మట్టిబిళ్ళల్ని పెళ్ళగించడానికి ఉపక్రమించాడు. సోమయ్యకేవీ అర్థం కాలేదు. కూడా తీసుకువచ్చిన కర్రతో తనూ కాలవ శుభ్రం చెయ్యడం మొదలుపెట్టాడు.

'ఇక్కడ చూడు మాంకూ' అన్నాడు చిన్నప్ప ఉత్సాహంగా. మాంకూ వెనక్కి తిరిగాడు. సిమెంటుకాలవ అక్కడ కొట్టేసివుంది. ఆపైన నీళ్ళుపోకుండా రాళ్ళు ఒకదానిమీద ఒకటి పేర్చివున్నాయి. అక్కణ్ణుంచి మంచిమలుపు తిరిగి కొండకి రెండవవైపు నీళ్ళు పారడానికి కట్టిన సన్నకాలువ ఆనవాళ్ళు చూచాయగా కనిపిస్తున్నాయి. 'ఈ కాలవ ఎక్కడికి పోతుంది మాంకూ' అన్నాడు చిన్నప్ప.

మాంకూ ముసలి కళ్ళు విలవిలా మెరిసాయి. చిన్నప్పని పరిశీలించి చూశాడు.

'ఏం మాంకూ' అన్నాడు చిన్నప్ప మళ్ళీ.

'దొర్లకి తెలీని యిసయమేటి?'

ఆ పక్కనే తవ్విన గోతిలోదిగి నుంచున్నాడు మాంకూ.

'ఇక్కడికి' అన్నాడు.

అతను లోపల నుంచోకపోతే అది గొయ్యని తెలియడం కష్టం. కలుపు మొకాళ్ళదాకా మాంకూని కప్పేసింది.

సోమయ్యకి చెప్పలేనంత ఆశ్చర్యం వేసింది. చరచరా గొయ్యి దగ్గిరకి



వెళ్ళాడు.

'వంటింట్లో నీళ్ళు విగ్రహం దగ్గిరకి వెళ్ళనేలేదన్నమాట!' అన్నాడు.

మాంకూ వున్న పళ్ళన్నీ బయటపెట్టి నవ్వాడు.

'అంతా తెలుసుండే దాచిపెట్టేవురా?' వురిమాడు సోమయ్య.

'నేదుదొరా' అన్నాడు మాంకూ.

'ఇంకా అబద్ధాలే, వెధవా!'

'సత్తెందొరా, ఆడుపోయేతలికి నాకు తెల్దు' అన్నాడు మాంకూ.

'ఎవరు?'

'ఆడే, కిరస్తానీ బొట్లేరు'

'వాడు తవ్వేడా ఈ గొయ్యి?'

'ఆడేమరి, వంటింట్లో అయ్యా, యియ్యా కడిగీవోడాడేగందా' అన్నాడు మాంకూ.

'వాడెళ్ళిపోయింతరవాత తెలిసిందని దొరతో చెప్పడం మానేస్తా... రాస్కెల్... స్కౌండ్రల్...'

సోమయ్య తిట్లతో గుక్కతిప్పుకోలేక ఉక్కిరిబిక్కిరయ్యాడు. అది మాంకూ వ్యక్తిగత సంబంధమైన విషయం అన్న తలపు అతనికి రాలేదు. జరిగింది ఎన్నో ఏళ్ళ క్రితం అనీ, తనకి పరిచయమైనాలేని మేంగిల్స్‌కనీ, దానివల్ల తనకే నష్టమూ కలగలేదనీ కూడా అనిపించలేదు. కింద పనిచేసే కూలీమీద కూడా అనిపించలేదు. కింద పనిచేసే కూలీమీద ఎస్టేట్లు నడిపే దొరల పక్షాన్న అతడు రౌద్రుడైపోయాడు.

'దొర్లు కోంపడమాకండి' అన్నాడు మాంకూ. 'గాల్దేవరు పూసుసెప్పకుంటా బలికీయెడవని'

'మాంకూ' పిలిచాడు చిన్నప్ప. అతని గొంతులో మార్దవం ఆవరించింది. మాంకూ తలెత్తి చూశాడు.

'నీగురించి మా తాత నాకెందుకు చెప్పలేదో తెలియడం లేదు' అన్నాడు.

'ఏటిదొరా! తవురనేది, తాతా?' ఆశ్చర్యపోయాడు మాంకూ.

'అవును చిన్నప్ప'

'కిరస్తానీ బొట్లేరు'

ఆప్యాయంగా ఏంభోనీ చిన్నప్ప దగ్గిరకి వెళ్ళి ఒళ్ళు నిమిరి చూశాడు మాంకూ. నచ్చినట్లు తృప్తిగా కనుబొమలెగరేసి బుర్ర ఆడించాడు. ఆ సాన్నిహిత్యానికి అతనిలో నిగ్రహం కట్టలు తెంచుకుంది. గట్టిగా నవ్వాడు. ఆ నవ్వు పెద్దదై ఇంకా పెద్దదై లోయ మారుమోగింది. వారించాలని ఎవరికి తోచలేదు.